గత సంచిక తరువాయి

# ఉన్మత్త

— రాంబాషా

"నోనో! నా ఉద్దేశం అది కాదు. నా భావాన్ని సరిగ్గా అర్థం చేసుకో, మతం మనిషితోపాటు పుట్టలేదు. మానవ నాగరికతలో ఓ భాగంగా ఉద్భవించింది. అయితే మత వ్యామోహాలు, మతోన్మాదాలు మనిషితోపాటే అస్తిత్వంలోకి వచ్చాయి. మనిషి పుట్టగానే ఆకలిదప్పులు, కోరికలు, రాగద్వేషాలు సహజ లక్షణాలుగా అతనికి సంక్రమించాయి. అదే మనిషి తన మనుగడ కోసం నాగరికతను అలవరచుకున్నాడు. రాజ్యాల్ని స్థాపించాడు. మతాల్ని ఆశ్రయించాడు. అయితే అతను ఎంత అభివృద్ధి చెందినా జన్మతః వచ్చిన సహజ లక్షణాలు అతన్ని వదిలిపోలేదు. అతన్ని వెన్నంటే వున్నాయి. ఒకవేపు దేశం, భాష, మతం మీద ప్రేమాభిమానాలు పెరుగుతూ పోగా మరోవేపు పరదేశం, పరభాష, పరమతాలపై ఈర్ష్య అసూయలు అంతరాంతరాల్లో చోటు చేసుకున్నాయి. అవి ఏమాత్రం అవకాశం దొరికినా కలహాల రూపంలో బయటపడుతున్నాయి. ఈనాడు జరుగుతున్నది కూడా ఇదే!"

ప్రొఫెసర్‌గారి మాటలకు గాఢంగా నిట్టూరుస్తూ నిరాశగా అడిగాను–

"అయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదంటారా?"

"పరిష్కార మార్గాలు చాలా వున్నాయి. వాటిని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సేవాసంస్థలు ఆచరిస్తూనే వున్నాయి. అయితే అవి మత కలహాల ఉధృతిని తగ్గించగలవే కాని శాశ్వతంగా రూపుమాపలేవు."

"అలాంటప్పుడు మనిషిలో పాదుకుపోయిన మతోన్మాదాన్ని, ఛాందస భావాల్ని శాశ్వతంగా తొలగించడానికి మార్గమేమిటి?",

"అందుకు ఒకటే మార్గముంది. ముందుగా మన మనసుల్ని నిష్కల్మషంగా పవిత్రంగా మార్చుకోవాలి. ఇతరులకు సలహా ఇచ్చే ముందు మనం చిత్తశుద్ధితో పాటించడం ఎంతో అవసరం. ప్రపంచంలోని ఏమూల ఎలాంటి దుర్ఘటనలు జరిగినా మనం ఉద్రేకపడకూడదు. అటువంటి పరిస్థితిలోనే ఎంతో సంయమనం పాటించాలి. అలాంటి సంఘటనలు గురించి ఎక్కువగా ఆలోచించినా, ఇతరులతో చర్చించినా మనకు తెలియకుండానే మనలో మతోన్మాదం తిష్ఠ వేసుక్కూచుంటుంది. అప్పుడు మనం అనాలోచితంగానే పర మతస్థులపై కక్ష పెంచుకోవడం జరుగుతుంది. దాంతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వారికి కీడు తలపెట్టడం జరుగుతుంది. మనలో అత్యధిక శాతం ఈ బలహీనతకు గురవబట్టే దేశంలో జరిగే ప్రతి సంఘటనకు దేశమంతా మత కల్లోలాలతో అట్టుడికినట్టు ఉడికిపోయింది. కాబట్టి ముందుగా మనమే బలహీనత మంచి బయటపడాలి" ప్రొఫెసర్‌గారు గంభీరంగా అన్నారు.

ఆయన చెప్పింది అక్షరాలా నిజమనిపించింది. ఆరాధనగా ఆయనవేపు చూస్తూ "మీరు చెప్పింది మాటికి మారుపాళ్ళు నిజం సార్! ప్రతి మనిషి ఈ క్షుద్ర విషయాలకు అతీతంగా వ్యవహరిస్తే స్వార్థ రాజకీయ నాయకులు, మత పెద్దలు ఎంతా రెచ్చగొట్టినా రక్తపాతం జరిగే అవకాశం వుండదు. ప్రజల్లో ఇలాంటి ఉదాత్త ధోరణి అలవడడానికి మీలాంటి మేధావులు కృషిచేయాలి" ప్రొఫెసర్‌గార్ని మనస్ఫూర్తిగా అభినందిస్తూ అన్నాను.

నా ప్రశంసలకు ఆయన ముఖం సంతోషంతో విప్పారింది "నేను రాసిన పుస్తకంలోను ఇదే సందేశం ఇచ్చాను. అది ప్రజల్లో నిజంగా మార్పు తెస్తే నా జన్మ ధన్యమైందనుకుంటాను" అన్నారు.

"మీలాంటి మేధావుల కృషి నిష్ప్రయోజం కాదు సార్! ప్రజల్లో నిదానంగానైనా విప్లవాత్మకమైన మార్పు తప్పకుండా వస్తుంది. వారిలో మతోన్మాదం, ఛాందసవాదం స్థానంలో మానవత్వం, సంఘీభావం తప్పకుండా చోటు చేసుకుంటాయి" దృఢంగా అన్నాను.

ప్రొఫెసర్‌గారు ఏదో అనబోతుండగా రాబోతున్న ట్రైన్ గురించి అనౌన్స్‌మెంట్ వచ్చింది. అప్పటిదాకా గుంపులు గుంపులుగా వున్న జనాల్లో వున్నట్టుండి చలనం వచ్చింది. ఎవరికి వాళ్ళు సామాన్లు సర్దుకుంటూ తాము వెళ్ళాల్సిన గమ్యం ఏదైనా, మత కలహాలతో, మారణహోమాలతో అట్టుడుకినట్టు వుడికిపోయిన ఈ ప్రదేశం నుంచి దూరంగా ఎవ్వరెవ్వరు వెళ్ళిపోదామా అన్నట్టు ప్లాట్‌ఫామ్ మీదికి తోసుకురాసాగారు. నేను, ప్రొఫెసర్‌గారితో పాటు మరో రెండడుగులు ముందుకు వేసి నుంచున్నాను.

కొద్దిసేపట్లో రైలు కెవ్వుమని అరుస్తూ ప్లాట్‌ఫాం మీదికి దడదడమంటూ చప్పుడు చేస్తూ వచ్చింది.

ఆ చప్పుడు ప్లాట్‌ఫాం మీదున్న వాళ్ళందరి గుండె చప్పుడును గుర్తుచేస్తున్నట్టు నాకనిపించింది.

రైలు ఆగగానే జనాల్లో ఒక్కసారి తొక్కిసలాట మొదలైంది. కుల మత భేద భావాలన్నీ మరచి ఎవరికి వాళ్ళు బోగీలో ప్రవేశించడానికి తొందరపడసాగారు. మనిషికి ప్రాణంపై ఎంత తీపో అనిపించింది. కొద్దిపాటి శ్రమతో ప్రొఫెసర్‌గార్ని ఓ బోగీలోకి ఎక్కించి నేనూ ఎక్కాను. కంపార్టుమెంటులోనే జనాలు ఒకర్నొకరు అనుమానంగా చూసుకుంటున్నారు. వాళ్ళ ముఖాలు పీక్కుపోయి, కళ్ళు లోతుకుపోయి ఓ విధమైన భయాందోళనలు వాళ్ల ముఖాల్లో ప్రతిఫలిస్తున్నాయి.

కులమత భేదాలు, భాషా సమస్యలు, ప్రాంతీయ పక్షపాతాలు ఏవీ పట్టని, ఏవీ తెలియని రైలుబండి పెద్దగా కూతవేస్తూ ఒక్క జర్క్‌తో ముందుకు కదిలింది.

సరిగ్గా అదే సమయంలో ఓ హృదయవిదారక ఆర్తనాదం దిక్కులు పిక్కటిల్లేలా వినిపించింది.

ఆ వెనువెంటనే గందరగోళంగా అనేక కంఠాల్లోంచి వెలువడిన హాహాకారాలు. కంపార్ట్‌మెంట్‌లోని వాళ్ళంతా అదిరిపడ్డారు. భయంతో వాళ్ళ ముఖాలు పాలిపోయాయి.

రైలు పదిగజాలు ముందుకు పోయిందో లేదో ఆగిపోయింది.

ప్లాట్‌ఫాం మీద కలకలం చెలరేగింది.

రైల్వే పోలీసులు, రైల్వే సిబ్బంది హడావుడిగా పరుగుదీశారు. గుంపుకట్టిన జనంలోంచి చోటు చేసుకుంటూ తొంగిచూశాను. రైలుకు, ప్లాట్‌ఫాంకు మధ్య పడివున్న రక్తపు ముద్దను చూడగానే కడుపులో తిప్పకొచ్చినట్టయింది. రైల్వే పోలీసులు అతి ప్రయాసతో నడుం వరకు తెగిపోయి రెండు ముక్కలైన ఓ వృద్ధుడి శవాన్ని బయటికి తీశారు.

సరిగ్గా రైలు కదులుతుండగా ఎవరో అతడ్ని రైలు కిందకి తోసేసి ముందుకు పరుగెత్తుకు వెళ్ళారని ఆ బోగీలోని వాళ్ళు రైల్వే పోలీసులకు వివరిస్తున్నారు.

అలా ముసలాయన్ని తోసేసిన వ్యక్తి ఏ కంపార్ట్‌మెంట్‌లోనో దూరి వుంటాడు. ఇంతమందిలో అతన్ని ఎలా గుర్తించాలో, ఆ సంఘటనకు ఎవరిని బాధ్యుల్ని చేయాలో అర్థం కానట్టు పోలీసులు తలలు పట్టుకున్నారు.

భారమైన మనసుతో వెనక్కి తిరిగి నా బోగీ చేరుకున్నాను.

నా సీట్లో కూర్చుంటుండగా–

"ఏం జరిగింది భరత్" ప్రొఫెసర్‌గారు అడిగారు.

"ఓ వృద్ధుడ్ని ఎవరో రైలు కిందకు తోసేసి చంపేశారు" ఆవేదనగా అన్నాను.

ఆ వృద్ధుడి మరణం నన్ను కదిలించడం వల్ల కాబోలు నా కంఠం రుద్ధమైంది.

"అరెరె! చాలా ఘోరం జరిగిందే, ఇంతకీ మరణించిన ఆ వృద్ధుడు హిందువా? ముస్లిమా?" ఉత్కంఠత నిండిన స్వరంతో ఆత్రంగా నావేపే చూస్తూ అడిగారు ప్రొఫెసర్‌గారు.

ఎవరో నా చెంప చెళ్ళుమనిపించినట్టు ఎదురుచూడని ఆ ప్రశ్నకు నేను చివాల్న తలెత్తి ఆయన కళ్ళలోకి సూటిగా చూశాను.

ఆయన మొహంలో అప్పటిదాకా నాతో సంభాషించిన మేధావి కనిపించలేదు. ఇప్పుడు ఆయన మొహంలో ఈ సువిశాల దేశంలోని ఓ సగటు మతాభిమాని మాత్రమే దర్శనమిచ్చాడు.

ఆయన పట్ల నాలోని ఆరాధన ఆవేదనగా, ఆవేదన ఆక్రోశంగా, ఆక్రోశం ఉక్రోషంగా మారి నా గుండెల్లో అణుబాంబులు బద్దలైనట్టయి గట్టిగా అరిచాను–

"ఒరేయ్! చనిపోయిన వ్యక్తి, చంపిన వ్యక్తి మతాల గురించి నాకు తెలియదు. నాకు తెలిసిందల్లా ఒక్కటే! చనిపోయినవాడు మనిషి! చంపినవాడు మతోన్మాదపు పిచ్చిపట్టిన రాక్షసుడు!!"